www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 226 | శనివారం | 11- 01 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల వేయి గొంతులు, లక్ష డప్పులతో సభను విజయవంతం చేయాలి



3

## తిరుపతి ఘటనతో అప్రమత్తమైన శబరిమల..!

తొలిఅడుగు, న్యూఢిల్లీ : ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతిలో తొక్కిసలాట ఘటనతో దేశవ్యాప్తంగా కలకలం రేగింది. తిరుపతి ఘటన నేపథ్యంలో.. దేశవ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో కలవరం మొదలైంది. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే ఆలయాల అధికారులు అప్రమత్తమయ్యారు. తిరుపతి ఘటన నేపథ్యంలో అన్ని ఆలయాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నారు. భారీ జన సందోహాలు వస్తున్న నేపథ్యంలో ఎలాంటి తొక్కిసలాటలు జరగకు ండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

2



# గొప్ప నగరాన్ని నిర్మిస్తాము

- పెట్టుబడులతో ముందుకు రండి
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అందిస్తాం
- సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్



తొలిఅడుగు, హైదరాబాద్ : ఫ్యూచర్ సిటీ పేరుతో దేశంలోనే ఒక గొప్ప నగరాన్ని నిర్మించాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ లాంటి ప్రపంచ నగరాలతో పోటీ పడాలన్న ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా పెట్టుబడులతో ముందుకు రావాలని పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం పలికారు. హైదరాబాద్‌లోని గ్రీన్ బిజినెస్ సెంటర్‌లో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య జాతీయ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి గారు ప్రసంగిస్తూ, పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. తెలంగాణలో ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందడానికి, స్వేచ్ఛా వాణిజ్యం, మార్కెట్లు పనిచేయడానికి పారిశ్రామిక రంగం సహకరించాలని కోరారు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అందించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా ఉందని చెప్పారు. "తెలంగాణ రైజింగ్ లక్ష్యంతో సేవల రంగం కేంద్రీకృతంగా ఫోర్త్ సిటీని నిర్మించాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష. హైదరాబాద్‌లో సంపూర్ణంగా నెట్ జీరో లక్ష్యాలతో పనిచేస్తున్నాం. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహిత నగరంగా మార్చడంలో భాగంగా 3200 ఆర్టీసీ బస్సుల స్థానంలో విద్యుత్ వాహనాలను సమకూర్చబోతున్నాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రిజిస్ట్రేషన్, రోడ్ టాక్స్‌లను పూర్తిగా రద్దు చేశాం. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు అత్యంత వేగంగా పెరుగుతున్నాయి.వరదలు లేని నగరంగా, దేశంలోనే పర్యావరణ హితమైన హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో చర్యలు చేపట్టాం. అందులో భాగంగా 55 కిలోమీటర్ల పొడవైన మూసీ పునరుజ్జీవ పనులను ప్రారంభించాం. 2050 నాటికి

2

## అత్యంత వైభవంగా స్వర్ణ రథం ఊరేగింపు



తొలిఅడుగు, తిరుమల : వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో శు క్రవారం స్వర్ణ రథం ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి స్వర్ణ రథంపై కొలువై తీరి మాడ వీధుల్లో విహరించారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, భక్తులు ఆధ్యాత్మిక పారవశ్యంతో గోవిందా..

2

## ఎమ్మెల్సీ స్థానాలకు బీజేపీ అభ్యర్థుల ప్రకటన



తొలిఅడుగు, హైదరాబాద్ : తెలంగాణలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థులను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు. నల్లగొండ - వరంగల్ - ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా పులి సరోత్తమ్ రెడ్డి, కరీంనగర్ - నిజామా బాద్ - ఆదిలాబాద్ - మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా మల్కా కొమరయ్య, కరీంనగర్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సి అంజిరెడ్డిని ఎంపిక చేసినట్టు కిషన్ రెడ్డి ప్రకటించారు.

## దేశ నిర్మాణమే మా ప్రధాన లక్ష్యం..



తొలిఅడుగు, న్యూఢిల్లీ : ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా 'ఎప్పుడూ ఇంట్లోనే ఉంటూ ఏం చేస్తారు..? ఎంతసేపని భార్య ముఖం తదేకంగా చూడగలరు? ' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన వ్యాఖ్యలపై నెట్టింట తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

2

## శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితాలో దిగజారిన భారత్ ర్యాంక్..!




తొలిఅడుగు, న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితాలో భారత్ 85వ స్థానంలో నిలిచింది. గత ఏడాది 80వ స్థానంలో ఉండగా.. ఈ సారి ఐదు స్థానాలు దిగజారింది. వీసా రహితంగా ట్రావెల్

2

## ప్రపంచం ఎదుట మరో పెనుముప్పు




తొలిఅడుగు, న్యూఢిల్లీ : చైనాలో పుట్టిన హెచ్ఎంపివి (హ్యూమన్ మెటాప్న్యూమోవైరస్) కోవిడ్ మాదిరి ప్రపంచవ్యాప్తంగా వేగంగా వ్యాపిస్తుంది. భారత్ ఇప్పటికే ఈ వ్యాధి సంక్రమణపై అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. అయితే హెచ్ఎంపివి వైరస్‌తో

2

# ఆదివాసీలపై వరాల జల్లు

- అధికారికంగా కొమురం భీం జయంతి.. వర్ధంతి
- ఆదివాసీలపై పెట్టిన ఉద్యమ కేసులు ఎత్తివేస్తాం...
- ఆదివాసీ విద్యార్థులకు వంద శాతం ఓవర్‌షిప్ స్కాలర్‌షిప్‌లు
- ఆదివాసీ సంఘాలు, నాయకులతో సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



తొలిఅడుగు, హైదరాబాద్ : ఆదివాసీలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరాల జల్లు కురిపించారు. ఆదివాసీ యోధుడు కొమురం భీం జయంతి.. వర్ధంతిని అధికారికంగా (స్టేట్ ఫంక్షన్‌గా) నిర్వహిస్తామని ప్రకటించారు. ఇందుకు సంబంధించి వెంటనే ఉత్తర్వుల జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆదివాసీ సంఘాలు, నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తమ ప్రాంతాల్లో రవాణా, సాగు, తాగునీటి సరఫరా, తమపై నమోదైన, నమోదవుతున్న

2

## కేటీఆర్‌పై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదు



తొలిఅడుగు, హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మరో కేసు నమోదైంది. నిన్న ఏసీబీ విచారణ అనంతరం అక్కడి నుంచి బీఆర్ఎస్ కార్యాలయం వరకు అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేశారు. ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదుతో కేటీఆర్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ బాల్క సుమన్, మన్నె గోవర్ధన్, క్రిశాంక్, జైసింహా తదితరులపై 305, ఆర్/డబ్ల్యూ 62 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదైంది.

## సూర్యాపేటలో ఘోర రోడ్డు ప్రమాదం



తొలిఅడుగు, సూర్యాపేట : తెల్లవారుజామున మంచు కురుస్తూ నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి ఒక్కసారిగా రక్తసిక్తమైంది. టైరు పేలి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని ఓ ప్రైవేట్ ట్రావెల్స్

## ఉగ్రవాదులున్న జైలు వద్ద డ్రోన్




తొలిఅడుగు, భోపాల్: ఉగ్రవాదులను ఉంచిన జైలు వద్ద డ్రోన్ ల్యాండ్ అయ్యింది. కెమెరాలున్న దీనిని 8 రోజుల తర్వాత భద్రతా సిబ్బంది గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ

2

# దేశ నిర్మాణమే మా ప్రధాన లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి**

అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పలువురు సెలబ్రిటీలు సైతం ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎల్ అండ్ టీ చైర్మన్ చేసిన వ్యాఖ్యలపై కంపెనీ స్పష్టతనిచ్చింది. దేశ నిర్మాణమే తమ సంస్థ ప్రధాన లక్ష్యం అని పేర్కొంది. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా భారతదేశ మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, సాంకేతిక సామర్థ్యాలను ఎల్ అండ్ టీ మెరుగుపరిచిందని వివరించింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అసాధారణ ఫలితాలు సాధించాలంటే అసాధారణమైన కృషి అవసరమని పేర్కొంది. ఈ విస్తృత లక్ష్యాన్నే చైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తాయని వివరణ ఇచ్చింది.

# తిరుపతి ఘటనతో అప్రమత్తమైన శబరిమల..!

**మొదటి పేజీ తరువాయి**

దేశంలో పలు ప్రముఖ ఆలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాల్లో గతంలోనూ ఎన్నో తొక్కిసలాట ఘటనలు జరిగాయి. వదంతులు, భయాలు, కొందరి తొందరపాటు చర్యలతో ఎన్నో ప్రాణాలు గాల్లో కలిశాయి. దక్షిణాదిలో ప్రసిద్ధిచెందిన కేరళ శబరిమల పుణ్యక్షేత్రంలో జరిగిన విషాదాన్ని ఇప్పటికీ ఎవరూ మరిచిపోలేదు. 2011 జనవరి 14న జరిగిందీ దారుణం. శబరిమల పరిధిలోని పుల్లమేడు దగ్గర భక్తుల పైకి జీపు దూసుకెళ్లటం తొక్కిసలాటకు కారణమైంది. ఈ దుర్ఘటనలో 104మంది మరణించారు. మకరజ్యోతి దర్శనాల్లో తొక్కిసలాటలు, చావు కేకలతో అప్పట్లో కేరళ ఉలిక్కిపడింది. తిరుపతి ఘటనతో, మరోసారి గత విషాదాలను, చేదు జ్ఞాపకాలను నెమరు వేసుకుంది శబరిమల. ఇక మకరవిళక్కు.. జనవరి 14వ తేదీన సంక్రాంతి నాడు రానుంది. ఆ రోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు.. మకరజ్యోతి ముమ్మార్లు కనిపిస్తుంది. ఇప్పటికే లక్షలాది మంది భక్తులతో శబరిమల కిటకిటలాడుతోంది. ఇక మకర జ్యోతి దర్శనం ఇచ్చే రోజున ఆ జన సందోహం.. మరింత భారీగా పెరగనుంది. ఆ సమయంలో ఎలాంటి తోపులాటలు, తొక్కిసలాటలకు తావు ఇవ్వకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. మకర జ్యోతి దర్శనం కోసం ఇప్పటికే శబరిమలకు లక్షలాదిగా పోటెత్తారు భక్తులు.

అయితే తిరుపతి తొక్కిసలాట ఘటనతో శబరిమల ఆలయ అధికారులు అప్రమత్తం అయ్యారు. మకరజ్యోతి నాడు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆన్‌లైన్ దర్శనాల టికెట్ల సంఖ్యను అధికారులు కుదించారు. జనవరి 13వ తేదీన 50 వేల మందికి ఆన్‌లైన్ స్లాట్లు కేటాయించారు. జనవరి 14వ తేదీన 40వేలమందికి, 15న 60 వేలమంది.. ఆన్‌లైన్ దర్శన టికెట్లను బుక్ చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శబరిమల అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

# శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితాలో దిగజారిన భారత్ ర్యాంక్..!

**మొదటి పేజీ తరువాయి**

చేయగలిగిన గమ్యస్థానాల ఆధారంగా హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2025 ఈ ర్యాంకింగ్స్‌ను ఇచ్చింది. మొత్తం 199 దేశాల్లో అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితాను ప్రకటించింది. ఈ జాబితా ప్రకారం భారత పాస్‌పోర్టుతో 57 దేశాలకు వీసా లేకుండానే ప్రయాణించే వీలుంది. ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ఇచ్చిన డేటా ఆధారంగా ఈ ర్యాంక్‌లను ప్రకటించింది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితాలో సింగపూర్ తొలి స్థానంలో నిలిచింది. ఈ దేశ పాస్‌పోర్టు కలిగిన వారు వీసా లేకుండానే 195 దేశాలకు వెళ్లొచ్చు. సింగపూర్ తర్వాత జపాన్ రెండో స్థానంలో నిలిచింది. ఈ దేశ పాస్‌పోర్టుతో వీసా లేకుండానే 193 దేశాలను చుట్టేయొచ్చు. ఇక ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, దక్షిణ కొరియా, స్పెయిన్ దేశాలు మూడో స్థానంలో నిలిచాయి. ఈ దేశాల పాస్‌పోర్టుతో వీసా లేకుండా 192 దేశాలను సందర్శించొచ్చు. ఆ తర్వాత ఆస్ట్రియా (191), డెన్మార్క్ (191) దేశాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# ప్రపంచం ఎదుట మరో పెనుముప్పు

**మొదటి పేజీ తరువాయి**

కోవిడ్ -19కి కొంత సారూప్యత ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. గురుగ్రామ్‌లోని మారెంగో ఆసియా హాస్పిటల్స్‌లోని సీనియర్ కన్సల్టెంట్- ఇంటర్నల్ మెడిసిన్ డాక్టర్ దీక్షా గోయల్ మాట్లాడుతూ.. హెచ్ఎంపివి,కోవిడ్ -19 మధ్య తేడాలు, సారూప్యతలను వెల్లడించారు. డాక్టర్ దీక్షా గోయల్ మాట్లాడుతూ, హెచ్ఎంపివి అనేది శ్వాసకోశ వైరస్. ఇది ప్రధానంగా ఊపిరితిత్తులు, శరీరంలోని వాయుమార్గాలను ప్రభావితం చేస్తుంది. ఇది దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడ, శ్వాసలో గురక వంటి సాధారణ జలుబు వంటి లక్షణాలను కలిగిస్తుంది. ఇది సాధారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు, బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారిని ప్రభావితం చేస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ అంటువ్యాధి వంటిది. చాలా కేసుల్లో తీవ్రత లేనప్పటికీ, తీవ్రమైన ఇన్ఫెక్షన్లు న్యుమోనియా లేదా బ్రోన్కియోలిటిస్‌కు దారితీస్తాయి. హెచ్ఎంపివి వైరస్ దశాబ్దాలుగా భూమిపై ఉనికిలో ఉన్నప్పటికీ అకస్మాత్తుగా వ్యాప్తి చెందడం, వ్యాధినిరోధకత బలహీనంగా ఉన్నవారిపై అధికంగా దాడి చేయడం వంటి.. వైరస్ ప్రవర్తనలోని ఈ మార్పులు ఆందోళన కలిగిస్తున్నాయి. హెచ్ఎంపివి చుట్టూ అనేక అపోహలు కూడా ఉన్నాయి. ఇది కోవిడ్ -19 వలె ప్రాణాంతకం కావచ్చని చాలా మంది భావిస్తున్నారు. నిజానికి, హెచ్ఎంపివి వైరస్ తీవ్రమైన శ్వాసకోశ అనారోగ్యానికి కారణం అవుతుందనేది వాస్తవమే. కొందరిలో తీవ్ర అనారోగ్యాన్ని కలిగించే అవకాశం ఉంది. కోవిడ్ - 19తో పోలిస్తే దాని మరణాల రేటు ప్రాబల్యం చాలా తక్కువ. హెచ్ఎంపివి సోకిన వారిలో తేలికపాటి నుంచి మధ్యస్తంగా అనారోగ్యాన్ని కలిగిస్తుంది. అయితే తీవ్రమైన కేసులు సాధారణంగా శిశువులు, వృద్ధులు, ఇతర రోగనిరోధక శక్తి లేనివారిలో సంభవిస్తాయి. అలాగే హెచ్ఎంపివి అనేది కోవిడ్-19 మాదిరి వేగంగా వ్యాప్తి చెందదు.

# తిరుమలలో అత్యంత వైభవంగా స్వర్ణ రథం ఊరేగింపు

**మొదటి పేజీ తరువాయి**

గోవిందా అంటూ స్వర్ణ రథాన్ని లాగారు. పాలకమండలి సభ్యురాలు సుచిత్రా ఎల్లా, అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనం కోసం రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రాల గవర్నర్లు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర విమానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కుటుంబ సభ్యులు, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే, మాజీ సీఎం ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుందర, బాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపిచంద్, ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ తదితరులు ఏడుకొండలవాడిని దర్శించుకున్నారు.

# గొప్ప నగరాన్ని నిర్మిస్తాము

**మొదటి పేజీ తరువాయి**

అవసరమయ్యే తాగునీటి అవసరాలకు అవసరమైన కార్యాచరణను ఇప్పటి నుంచే ప్రారంభించాం.తెలంగాణ మణిహారంగా రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాం. అవుటర్ రింగ్ రోడ్డుకు రీజినల్ రింగ్ రోడ్డుకు మధ్యన రేడియల్ రోడ్లను నిర్మించబోతున్నాం. ఆయా ప్రాంతాల్లో ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఈవీ, సోలార్ పవర్ వంటి పరిశ్రమలు అక్కడ ఏర్పాటు చేయబోతున్నాం. 360 కి.మీ పొడవు ఉండబోయే రీజినల్ రింగ్ రోడ్డు వెంట రీజినల్ రింగ్ రైల్‌ను నిర్మించాలని ప్రధానమంత్రి గారిని కోరాం. రీజినల్ రింగ్ రోడ్ చుట్టూ తయారీ పరిశ్రమ, మార్కెటింగ్ కు అవసరమైన కేంద్రీకృత ప్రదేశాలను ఏర్పాటు చేయాలన్నది మా ఉద్దేశం.చైనా తరహాలో రకరకాల క్లస్టర్లను సృష్టించాలని భావిస్తున్నాం. ఒక లైట్ సిటీ, మార్బుల్ సిటీ, గ్రానైట్ సిటీ, ఫర్నీచర్ సిటీ... ఇలా ప్రత్యేక తరహాలో రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ మార్కెటింగ్ కార్యకలాపాల విస్తరణకు ప్రయత్నిస్తున్నాం. రీజినల్ రింగ్ రోడ్ పూర్తయితే తెలంగాణ ప్రాంతంలో 70 శాతం పట్టణీకరణ జరుగుతుంది. రింగ్ రోడ్డు ఆవలివైపున గ్రామీణ తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా వ్యవసాయం, సేంద్రీయ సాగు, రైతుల కోసం గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. తెలంగాణకు సముద్ర తీరప్రాంతం లేని కారణంగా డ్రై పోర్టును ఏర్పాటు చేస్తున్నాం. పోర్టుతో అనుసంధానం చేయడానికి మచిలీపట్నం ఓడరేవు వరకు ప్రత్యేక రహదారి, రైల్వే కనెక్టివిటీని ప్రతిపాదించాం. నైపుణ్యత పెంచడానికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంపై ప్రధానంగా దృష్టి సారించాం. చైనా ప్లస్ వన్ వ్యూహంలో హైదరాబాద్‌ను ప్రపంచంలో ప్రధాన పెట్టుబడుల కేంద్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించడం శుభ పరిణామం. అత్యుత్తమ వ్యాపార సౌలభ్యాలను అందించడానికి తెలంగాణ సిద్ధంగా ఉంది. సీఐఐ కలిసిరావాలి. అందరం కలిసి అద్భుతాలు సాధించవచ్చని మా నమ్మకం" అని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు.ఈ సమావేశంలో సీఐఐ అధ్యక్షుడు సంజీవ్ పూరి, వైఎస్-ప్రెసిడెంట్ ఆర్. ముకుందన్, సీఐఐ డైరెక్టర్ చంద్రజీత్ బెనర్జీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తో పాటు సీఐఐ ప్రతినిధులు, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదులున్న జైలు వద్ద డ్రోన్

**మొదటి పేజీ తరువాయి**

జైలులోని భద్రతా ప్రమాణాలపై విమర్శలు వెల్లువెత్తాయి. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. అక్కడి కేంద్ర కారాగారంలో కరుడు గట్టిన 69 మంది ఉగ్రవాదులను ఉంచిన ప్రత్యేక సెల్ బీ బ్లాక్ సమీపంలో ఒక డ్రోన్ పడి ఉంది. జనవరి 8న భద్రతా సిబ్బంది దీనిని గుర్తించారు. కాగా, కెమెరాలున్న చైనా తయారీ డ్రోన్ భోపాల్ జైలు వద్ద కనిపించడం కలకలం రేపింది. డిసెంబర్ 31న అది అక్కడ ల్యాండ్ అయినట్లు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా భద్రతా సిబ్బంది తెలుసుకున్నారు. గత ఎనిమిది రోజులుగా జైలు ప్రాంగణంలో ఆ డ్రోన్ ఉన్నప్పటికీ ఎవరూ గమనించలేదు. ఈ నేపథ్యంలో ఆ జైలులో భద్రతా లోపాలు, సిబ్బంది నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తాయి. మరోవైపు ఆ డ్రోన్ యజమాని స్థానిక డాక్టర్ స్వప్నిల్ జైన్‌గా పోలీస్ అధికారులు గుర్తించారు. అతడి కుమారుడి కోసం కొన్న ఆ డ్రోన్ డిసెంబర్ 31న నియంత్రణ కోల్పోయి జైలు సమీపంలో పడినట్లు తెలుసుకున్నారు. కాగా, ఐఎస్‌వో సర్టిఫైడ్ భోపాల్ జైలులో జామర్లు, సీసీటీవీలు సహా బహుళ స్థాయి భద్రత ఉన్నప్పటికీ వారం రోజులకు పైగా ఆ డ్రోన్‌ను భద్రతా సిబ్బంది గుర్తించకపోవడం ఆందోళన రేపింది. ఈ నేపథ్యంలో జైలు వద్ద భద్రతను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జైలు, పరిసర ప్రాంతాలను 'నో-ఫ్లై జోన్'గా పరిగణించాలని యోచిస్తున్నది.

# ఆదివాసీలపై వరాల జల్లు

**మొదటి పేజీ తరువాయి**

కేసులు, విద్యా, ఉద్యోగ, ఆర్థిక సమస్యలను ఆదివాసీ నాయకులు ముఖ్యమంత్రికి సోదాహరణంగా వివరించారు. ప్రతి సమస్యను సావధానంగా విన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారు లేవనెత్తిన పలు సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపారు. మరికొన్నింటి పరిష్కారానికి సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఇది తొలి సమావేశం మాత్రమేనని, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి సమావేశమవుదామని ఆదివాసీ నాయకులకు సీఎం తెలిపారు. ఏడాదికి మూడు సార్లు జరిగే సమావేశాల్లో గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, రాబోయే కాలంలో పరిష్కరించుకోవాల్సిన అంశాలపై చర్చిస్తామని ఆదివాసీ నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభయమిచ్చారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని... ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళనలకు దిగవద్దని సీఎం సూచించారు. ఆందోళనల ఫలితంగా యువకులపై కేసులు నమోదయితే భవిష్యత్‌లో అవి వారి ఉద్యోగ అవకాశాలకు గండిపెడతాయని సీఎం తెలిపారు. ఆదివాసీలపై ఉద్యమాల సమయంలో పెట్టిన కేసులు ఎత్తివేస్తామని.. ఈవిషయంలో అవసరమైతే శాసనసభలో చర్చపెట్టి తీర్మానం చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తాను పీసీసీ అధ్యక్షునిగా అయిన తర్వాత తొలి సమావేశం ఇంద్రవెల్లిలోనే పెట్టానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివాసీ నాయకులకు గుర్తు చేశారు.

# సూర్యాపేటలో ఘోర రోడ్డు ప్రమాదం

బస్సు ఢీకొట్టిన ఘటనలో ఐదుగురు కూలీలు అక్కడికక్కడే మృతిచెందగా, 10మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో భార్యాభర్తలు, ఓ మహిళ, వృద్ధుడు, డ్రైవర్ ఉన్నారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. శుక్రవారం తెల్లవారుజామున సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని ఐలాపురం గ్రామ స్టేజీ సమీపంలో ఖమ్మం-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎస్ఐ వల్లపు మహేశ్వర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం కోరాపూట్ జిల్లాకు చెందిన 32మంది హైదరాబాద్‌లో భవన నిర్మాణ కార్మికులుగా పనిచేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. పనులు ముగియడంతో రెండు నెలల క్రితం వారు సొంత రాష్ట్రానికి వెళ్లారు. హైదరాబాద్‌లోని కోఠి, జీడిమెట్ల ప్రాంతాల్లో పనులు ప్రారంభం కావడంతో భవన నిర్మాణ పనులు చేయడానికి తిరిగి గురువారం ఉదయం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన ఓ ట్రావెల్ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరారు.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల వేయి గొంతులు, లక్ష డప్పులతో సభను విజయవంతం చేయాలి




తొలి అడుగు, చిన్నకోదూరు, జనవరి 10 : సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండల కేంద్రంలోని ఈనెల 20న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఛలో సిద్దిపేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 7న హైదరాబాద్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి 1000 గొంతులు, లక్ష డప్పుల నిదానంతో ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయాలని రథయాత్రను ప్రారంభించారు . ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జేరిపోతుల లక్ష్మణ్ మాదిగ, ఎమ్మెస్పి జిల్లా అధ్యక్షులు పెరిక పరశురాములు మాట్లాడుతూ... 1000 గొంతుకల లక్ష డప్పుల మండే మాదిగల గుండెచప్పుడే మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈనెల 20వ తేదీన సిద్దిపేటలో, ఫిబ్రవరి ఏడు హైదరాబాదులో భారీ పెద్ద ఎత్తున జరగబోయే భారీ బహిరంగ సభకు వేలాదిమంది గ్రామ గ్రామాల నుండి మాదిగలందరూ తరలి రావాలని అన్నారు. మందకృష్ణ మాదిగ గత 30 సంవత్సరాల నుండి అలుపెరుగని పోరాటం చేశారు. మాదిగల కోసం మన హక్కుల కోసం మన ఉద్యోగాల కోసం మన పిల్లల భవిష్యత్తు కోసం పోరాడటం. ఎక్కడో ఊర్లో ఉన్న చివరి మాదిగలను పేరు చివరగా తీసుకొచ్చిన సమాజం కి సమానత్వంతో పాటు మనకు ఆత్మీయతను గౌరవం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక కళాకారులు , ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు, వివిధ గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం నిషేధించిన గుడుంబా, నాటుసారా స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, జనవరి 10 : నంగునూరు మండలంలో నిందితుడు గుగులోత్ శ్రీను తండ్రి వెన్ననాయక్, వయస్సు 30 సంవత్సరాలు, మల్ చెరువు తాండ గ్రామం మండలం అక్కన్నపేట అతను తన యొక్క మోటార్ సైకిల్ నెంబర్ %ూ36వీ%-8298 గల దానిలో ప్రభుత్వం నిషేధించిన గుడుంబా, నాటు సారా తీసుకొని సిద్దిపేట వైపు వస్తున్నాడని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారులు సిబ్బంది గట్ల మల్యాల గ్రామ శివారులో పై నిందితుని వాహనము ఆపి తనిఖీ చేయగా 10 ప్యాకెట్ల నాటుసారా, గుడుంబా 10 లీటర్లు స్వాధీనం చేసుకొని నిందితున్ని వాహనాన్ని రాజగోపాలపేట పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

రాజగోపాలపేట పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన, బెల్ట్ షాపులు నడిపిన, గుడుంబా నాటు సారా ఎవరన్నా తయారుచేసిన కలిగి ఉన్న చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు జరుగుతుందని తెలిపారు.గ్రామాలలో,పట్టణాలలో ఇసుక, అక్రమ రవాణా చేసిన, పిడిఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన బెల్ట్ షాపులు నడిపిన, గ్యాంబ్లింగ్,%ష%, పేకాట, ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు కలిగి ఉన్నా రవాణా చేసిన మరిఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

# విద్యార్థులను కొట్టిన వార్డెన్ ఘటనపై దుద్దెడ రెసిడెన్షియల్ విద్యార్థులను కలిసిన యూఎస్ఎఫ్ఐ ప్రతినిధులు


తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, జనవరి 10 : సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో మార్నింగ్ ట్యూషన్ కు ఆలస్యంగా వచ్చారని పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ వాసు కొట్టిన విషయం తెలుసుకొని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ( యు ఎస్ ఎఫ్ ఐ ) సిద్దిపేట జిల్లా నాయకత్వం శుక్రవారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులను జరిగిన ఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని మౌలిక సదుపాయాలు పరిశీలించి, విద్యార్థులకు వడ్డించిన మధ్యాహ్న భోజనాన్ని తిని పరిశీలించారు.



ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి చంద్లాపురం మధు మాట్లాడుతూ ... గత మూడు రోజుల క్రితం ఉదయం 6 గంటల ట్యూషన్ కి 30నిమిషాలు లేటుగా హాజరైన పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ వాసు విద్యార్థులు టవల్ పై ఉండగానే విచక్షణారహితంగా కొట్టారని దీనివల్ల విద్యార్థులకు ఒంటిపై వాతలు కూడా వచ్చాయని అలాగే పిడి గారు వచ్చినప్పటి నుంచి విద్యార్థులతో దురుసుగా మాట్లాడేవారని అలాగే అసభ్య పదజాలంతో దూషించేవారన్నారు. చిన్న చిన్న తప్పులకు కూడా విపరీతంగా కొట్టేవారని కొద్దీ మంది విద్యార్థులు తెలిపారు. క్రమశిక్షణ కోసమే కొట్టారని, విద్యార్థులను ఆటల్లో బాగా ఆడించేవారని, కొద్దిమంది విద్యార్థులు తప్పుదోవ పడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని ఆ కోపంలో వారు అలవాట్లు మానుకోవాలని కొట్టారని మరికొద్ది మంది విద్యార్థులు తెలిపారు. ఏది ఏమైనా పిడి విద్యార్థుల మంచి కోసం మరి ఇంతలా కొట్టడం అనేది సరైన పద్ధతి కాదు అలాగే ఈ సంఘటనను క్రమశిక్షణ తప్పుతున్న విద్యార్థులపై కఠినంగా దండించడం వరకు మాత్రమే చూడాలి కాని అనవసరపు రాజకీయాల్లోకి ఈ విషయాన్ని లాగ వద్దని ముఖ్యంగా వంటేరు ప్రతాప్ రెడ్డి ఈ ఘటనను విద్యార్థులు, ఉపాధ్యాయులకు మధ్య జరిగిన సంఘటన లాగే చూడాలి కానీ రెండు పార్టీల మధ్య జరుగుతున్న ఘటనగా చూడవద్దని ఉన్నారు. ఎందుకంటే బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే రెసిడెన్షియల్ పాఠశాలలోకి విద్యార్థి సంఘాలను కానీ ఇతర రాజకీయ నాయకులను కానీ రానివ్వకుండా కఠినమైన నిబంధనలు తీసుకోవచ్చారని గుర్తు చేశారు. ఆ సమయంలో కూడా అక్కడక్కడ కొన్ని విద్యార్థులను ఉపాధ్యాయులు కొట్టిన సంఘటనలు కూడా చూసామని వాటిని ఎవరు కూడా రాజకీయంగా చూడలేదన్నారు. ఇప్పుడు ఈ సంఘటనను కూడా రాజకీయంగా చూడవద్దని అన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా సంస్థల్లో పంపిణీ చేస్తున్న బియ్యాన్ని నాణ్యతతో కూడినవి పంపిణీ చేయాలని, ఇప్పుడు పంపిణీ చేస్తున్న బియ్యం బాగా ఉడకడం లేదని అన్నారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఎప్పుడూ కూడా ఏ రాజకీయ పార్టీ పక్షాన కానీ, ఏ పార్టీకి తొత్తుగా కానీ పనిచేయదని, అలాగే ఏ పార్టీ తప్పు చేసిన వేలెత్తి చూపిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సతీష్, మరియు జిల్లా నాయకులు వినయ్, శ్రావణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఎమ్మార్వో చేతుల మీదుగా చెక్కులు పంపిణీ



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, జనవరి 10 : నంగునూరు మండలం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ జి. సరిత పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు తహశీల్దారు కార్యాలయంలో శుక్రవారం మండల వ్యాప్తంగా 38 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 1,00,116/- చొప్పున సుమారు రూ. 38,04,408/-ల కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. చెక్కులు తీసుకున్నవారు వెంటనే తమ బ్యాంకు ఖాతాలో జమచేసుకోవాలని సూచించారు. ఆడబిడ్డ పెళ్ళికి ఆ తల్లిదండ్రులకు భారం కాకూడదనే మంచి లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. మండలంలో ఇంకా ఎవరైనా చెక్కులు రానివారు ఉన్నట్లయితే ఎలాంటి అనుమానాలు, అపోహలు పెట్టుకోనవసరం లేదని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ విడతల వారిగా కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులు అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, గిర్దావర్ లు లింగం, జయసూర్య, సిబ్బంది పాల్గొన్నారు.


# కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

తొలి అడుగు, నంగునూరు మండలం, సిద్దిపేట జిల్లా, జనవరి 10 : వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం లోని వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఉత్తర ద్వారం నుండి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ కమిటీ చైర్మన్ రాధాకిషన్ రావు యువత స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... కలియుగ ప్రత్యక్ష దైవం కోరిన కోరికలు నెరవేర్చు కొంగు బంగారం వేంకటేశ్వరుడిని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని పాడి పంటలతో ఆయురారోగ్యాలతో ప్రజలు విరజిల్లాలని ఆ వెంకటేశ్వరుని కోరుకున్నానని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ గ్రామ యువత ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్వీ నాయకులు సంపత్ యాదవ్, కొల శ్రావణ్ గౌడ్, మధు, శ్రీకాంత్, రాజ్ కుమార్, ప్రవీణ్ వివిధ గ్రామాల యువత పాల్గొన్నారు.



# మాజీ మంత్రి హరీష్ రావు కృషితో 2600ల ఎకరాలకు సాగునీరు అందనుంది

**– హరీష్ రావు చిత్రపటానికి పాలభి షేకం చేసి కృతజ్ఞతలు తెలిపిన రైతులు**



తొలి అడుగు, చిన్నకోడూర్, జనవరి 10 : చిన్నకోడూరు మండలం విఠలాపూర్ గంగాపూర్ సరిహద్దులలో ఉన్న రైతులకు సాగు చేసుకోవడానికి నీరు అందడం లేదని మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావు కి రైతులు విన్నవించగా సంబంధిత అధికారులతో సంప్రదింపులు చేసి అదే విధంగా కాల్వ కోసం భూములు పోయే రైతులతో మాట్లాడి ఒప్పించి కాల్వ పనులను ప్రారంభించడం సంతోషకరమని రైతులు అన్నారు. ఈ సందర్భంగా సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కేసిఆర్ హరీష్ రావుల చిత్రపటానికి పాలభిషేకం చేసి హరీష్ రావు కి కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య పాల్గొని మాట్లాడుతూ గతంలో ఈ కాల్వకు అనేక అడ్డంకులు ఉన్నాయని అయొక్క అడ్డంకులు తొలగించడానికి హరీష్ రావు సార్ కృషిచేసి సంబంధిత అధికారులతోని సంప్రదింపులు చేసి ఏది ఏమైనా భూములు పోతున్న రైతులకు తొందరగా డబ్బులు అందించాలని అదేవిధంగా తక్షణమే పని ప్రారంభించమని చెప్పగా సంబంధిత అధికారులు ఈరోజు జెసిబి ద్వారా కాల్వ పనులు ప్రారంభించడం జరిగిందని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను గాలికి వదిలి పబ్బం గడుపుతున్నారని రైతుల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని కానీ హరీష్ రావు గారు చొరవ తీసుకొని రైతుల అభివృద్ధి తన ధ్యేయంగా రైతు కళ్ళల్లో ఆనందాన్ని చూడాలనే ఉద్దేశంతో నిరంతరాయంగా వారికి వ్యవసాయం నడవాలని వ్యవసాయం నడవాలంటే నీళ్లు కావాలని ఆ నీటిని అందించే బాధ్యత తన భుజాల మీద వేసుకొని ఎప్పటికప్పుడు రైతులతో అధికారులతో సంప్రదింపులు చేస్తూ పెండింగ్ పనులను చేయిస్తున్నాడని ఇలాంటి నాయకుడు ఎక్కడ ఉండడని సిద్దిపేట నియోజకవర్గ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా చూస్తూ ఎవరికీ ఏది అవసరం పడిన వారికి తక్షణమే సహాయ సహకారాలు అందిస్తున్నాడని కాబట్టే నియోజకవర్గం ప్రజలు హరీష్ రావు గారి వెంబడి ఉంటున్నారని వారు అన్నారు. ఈ కాలువ ద్వార రెండు వేల ఆర్ వందల ఎకరాలకు నీరు అందుతుందన్నారు ఇట్టి కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మాజీ సర్పంచ్ మద్దికుంట నవీన్ యూత్ మండల అధ్యక్షుడు గుండెల్లి వేణు రైతులు కుంటయ్య రాములు ఎల్లయ్య ఆకునూరి శంకర్, పిడిశెట్టి నర్సయ్య, శంకర్ రెడ్డి, శ్రీనివాస్, దేవయ్య, ఎల్లయ్య, భూపతి, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంక్రాంతి వేడుకలు




తొలి అడుగు, ధర్మారం, జనవరి 10 : ధర్మారం మండలం లోని పలు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు రమణీయంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాల రచ్చపల్లి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వంశీ మోహనా చార్యులు మాట్లాడుతూ ... మన పండుగల లో ఎంతో శాస్త్రీయత ఉందని సంక్రాంతి ముఖ్యంగా ఈ పండుగ రైతులు కొత్త పంట ఇంటికి వచ్చినందుకు చేసుకొనే పండుగ ఈ పండుగ మూడు రోజుల పండుగ దీనిలో మొదటి రోజు భోగి అని ఈ రోజు పిల్లలకు భోగి పండ్లు పోస్తారు భోగి మంటలు పెడుతారు. రెండవ రోజు సంక్రాంతి సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే రోజు మకర సంక్రాంతి అని ఇదే రోజు ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభవుతుందని తెలిపారు. సంక్రాంతి రోజు ముగ్గులు గొబ్బెమ్మ లు గంగిరెద్దులు హరిదాసులు ఇలా సంక్రాంతి జరుపుకుంటారు. మరుసటి రోజు కనుమ పండుగ ఇది పశువుల పూజించడం జరుగుతుందని పండుగ విశిష్టత ను పిల్లలకు వివరించారు. పిల్లల తల్లిదండ్రులు చాలా సంతోషం వ్యక్తం చేశారు. పిల్లలకు అర్థం అయ్యే విందంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ముగ్గులు వేసి, భోగిమంటలు వేస్తూ పాఠశాలలో వేడుకలు ఘనముగా నిర్వహించుట జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపత్, లక్ష్మణ్,అంగన్వాడీ టీచర్ రచన, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాణాపురం నేషనల్ హైవే రోడ్డు దగ్గర అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి ప్రజలను ప్రమాదాల నుండి కాపాడాలి

**– సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి**

తొలిఅడుగు, జనగామ, జనవరి 10 : జనగామ పట్టణంలో బాణాపురం ఐదో వార్డు ఎన్ హెచ్ రోడ్డు దగ్గర అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి ఎల్లముల సిద్దంకి పెదరాంచర్ల పోసన్నపేట సిద్దిపేట హైదరాబాద్ రోడ్లను కలుపుతూ ఉన్నటువంటి రోడ్డును బ్లాక్ చేయకుండా అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎం జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రోడ్డును సందర్శించి అనంతరం మోకు కనకా రెడ్డి మాట్లాడుతూ ఏసీ రెడ్డి నగర్ బాణాపురం ఇందిరమ్మ కాలనీ ఇండ్లన్నిటిని రాబోయే రోజులలో అభివృద్ధి కాకుండా అడ్డం వస్తుంది అని అన్నారు కాబట్టి తక్షణమే జిల్లా కలెక్టర్ ఆర్ అండ్ బి . ఈ ఈ వారు స్పందించి అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి సహకరించాలని అన్నారు లేకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు

ఈ కార్యక్రమంలో సిపిఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ జిల్లా కమిటీ సభ్యులు భూక్య చందు నాయక్ బోడ నరేందర్ పట్టణ కమిటీ సభ్యులు పందిళ్ళ కళ్యాణి బాల్నే వెంకట మల్లయ్య కళ్యాణం లింగం పాము శ్రీకాంత్ బూడిది ప్రశాంత్ మంగ బీరయ్య శాఖ కార్యదర్శిలు గుండె మల్లేష్, బూడిది అంజమ్మ, చీర రజిత, చింతల శ్రీలత, మునిసిపట్ల జయ, ఏనుగుల కమల, శ్రీపతి మమత, బండ దినేష్, మచ్చ వెంకటేశ్వర్లు, చింత బాబు, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## ఎఫ్ ఎస్ సి ఎ యువజన సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ క్రీడా పోటీలు

తొలి అడుగు, యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ జనవరి : 10 యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రం లో శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఎఫ్ఎస్ సి ఎం యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆదివారం రెండు రోజులు క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని ఎఫ్ ఎస్ సి ఏ యువజన సంఘం అధ్యక్షుడు కొండూరు బాలరాజు తెలిపారు. శనివారం రోజు ఉదయం 10.00 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహించబడునని ఆయన తెలిపారు. ఆదివారం రోజు వాలీబాల్ క్రీడ పోటీలు నిర్వహించ బడునని ఆయన తెలిపారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా 4016/- రూపాయలు ద్వితీయ 3016/- రూపాయలు తృతీయ బహుమతిగా 2016/- రూపాయలు కన్సోలేషన్ బహుమతిగా 1016/- అదేవిధంగా వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి గా 5016/- రూపాయలు ద్వితీయ బహుమతిగా 3016/- రూపాయలు అందించబడునని ఆయన తెలిపారు. పోటీలో పాల్గొన్న వారు ఈ కింది ఫోన్ నెంబర్ల కు 9948640071, 9985042701, 9849603602 ఫోన్ నెంబర్లకు పేర్లు నమోదు చేసుకోవాలని ఎఫ్ ఎస్ సి ఐ యువజన సంఘం అధ్యక్షులు, సభ్యులు తెలిపారు.

# సంపాదకీయం

పర్యావరణానికీ రాజకీయాలు..

తీవ్ర వాతావరణ సంఘటనల సంవత్స రంగా, అత్యంత ఉష్ణోగ్రతల కాలంగా చరిత్రలో నిలిచిపోతూ 2024 మన నుంచి సెలవు తీసుకుంది. ఎప్పుడూ ఎరగని వడగాడ్పులు, భయంకరమైన చలిగాలులు మనల్నే కాదు శ్రీలంక, మాల్దీవుల్ని కూడా ఈ ఏడాది అతలాకుతలం చేశాయి. మొన్నటికి మొన్న 'ఫంగల్' తీరం దాటుతున్నప్పుడు పాండిచ్చేరిలో ఒకేసారి 50 సెంటీమీటర్ల వర్షం కురిసింది! 2023లో ఆకాశానికి రంధ్రం పడినట్లు ఒకే రోజు 95 సెంటీమీటర్ల వాన కాయపట్నాన్ని (తూత్కుడి) ముంచెత్తింది! ప్రతి ఏటా ఈశాన్య రుతుపవనాల కాలంలో దక్షిణ ద్వీపకల్పంలో సగటున ఇలాంటి నాలుగు తుఫాన్లు తప్పవని ఇటీవల భారత వాతావరణ శాఖ మొహమాటం లేకుండా ప్రకటించింది. ఇక మొత్తం భూమండలాన్ని పలిశీలిస్తే 1.5 డిగ్రీలకు మించి భూమి ఉష్ణోగ్రత పెరగరాదని మనం పెట్టుకున్న లక్ష్మణ రేఖ ఉత్తుత్తి గీతగా మిగిలిపోయిందనీ, 2035 నాటికి 3.1 సెల్సియస్ డిగ్రీలు పెరిగినా ఆశ్చర్య పోనక్కరలేదని హెచ్చరిస్తున్నారు. ఇదే జరిగితే ఆంత్రోపోసిస్ యుగం మనల్ని అంతుబట్టని తీరాలకు చేర్చడం ఖాయం. మాంట్రియల్ ప్రోటోకాల్ (1989) ముందుకు తెచ్చిన ఓజోన్ పొర రక్షణ, క్యోటో ప్రోటోకాల్ (2005) ప్రతిపాదించిన గ్రీన్‌హౌస్ ఉద్గారాల తగ్గింపు, పారిస్ ఒప్పందపు (2016) ఉష్ణోగ్రతల తగ్గింపు, గ్లాస్గో క్లైమేట్ ప్యాక్ లోని శూన్య ఉద్గార దేశాలకు నష్టపరిహార చెల్లింపు వంటివి పర్యావరణ ప్రియులందరూ గొప్ప మైలురాళ్ళుగా చెప్పుకుంటారు. వాటి విలువను తక్కువ అంచనా వెయ్యలేము. మొన్నటికి మొన్న 'బాకు' నగర అంతర్జాతీయ సదస్సులో ఆమోదించిన 'ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ కార్బన్ మార్కెట్' స్థాపన, కార్బన్ ఉద్గారాల నికర డేటా డాక్యుమెంటేషన్ వ్యవస్థ ఏర్పాటు కూడా గొప్ప ముందడుగుగా భావించవచ్చు.

కానీ పేద దేశాలకు అందించే నష్టపరిహారంపై ధనిక దేశాలు గొప్ప ఉదారతను ప్రదర్శించినట్లు అంతర్జాతీయ మీడియా కొనియాడ్డమే ఆశ్చర్యం కలిగిస్తుంది. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షైన్ బమ్ (ఆమె పర్యావరణ శాస్త్రవేత్త కూడా) లాగా 2050 నాటికి తాము శూన్య ఉద్గార దేశంగా మారి తీరుతామని బల్ల గుద్ది మరీ చెప్పిన అధినేత ఒక్కరంటే ఒక్కరూ లేరు. అలాగే 2040 కల్లా బొగ్గు గనులన్నీ మూసేస్తామని చెప్పిన ఇండోనేషియా లాంటి దేశం ధనిక దేశాల్లో ఒక్కటంటే ఒక్కటీ లేదు. ఉద్గారాల వరుసలో ముందున్న 24 దేశాలన్నీ పేద దేశాలకు ఆర్థిక సాయం గురించి మాట్లాడాయే తప్ప 'నెట్ జీరో' సాధిస్తామని మాట వరసకైనా చెప్పలేదు. "మేం పర్యావరణ ధ్వంసం చేస్తాం. పేద దేశాలు విలవిలలాడుతాయి. వాటికి అంతో ఇంతో సాయం చేస్తాం" ఇదీ వాటి తీరు! ఇక నష్టపరిహారం కిందా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కోసమూ ఇస్తామంటున్న నిధులు కూడా బ్యాంకులో, కార్బన్ మార్కెట్లో, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో సమకూరుస్తాయి తప్ప ప్రభుత్వాలు మాత్రం పూర్తి బాధ్యత తీసుకోవట! విచిత్రం ఏమంటే సంపన్న దేశాల్లో ఎంత శాస్త్ర సాంకేతికత పెరిగినా కర్బన ఉద్గారాలేమీ తగ్గడం లేదు. ఉద్గారాల 'లెక్కల్లో లాఘవం' మాత్రం పెరుగుతోంది. ఏకీకృత అంతర్జాతీయ వ్యవస్థ ఏదీ మన భూగోళం గురించి పట్టించుకునేది లేకపోవడం పెద్ద విషాదం.

ఇక కాప్ 29 సదస్సులో ఆయిల్ గ్యాస్ కంపెనీల అధినేతలు "మేం లేకుంటే మానవుడు మళ్ళీ గుహల్లో బతకాల్సిందే" అంటూ ప్రారంభ సభలోనే బెదిరింపులకు దిగడం విచిత్రాల్లోకల్లా విచిత్రం. కాలం అలా వుంది మరి! ఎప్పుడూ ఎరగని అసమానతల వైపరీత్యం ఒకవైపు, బహుళ జాతి కంపెనీల విశ్వరూపం మరోవైపు, పర్యావరణ సమస్యనే అంగీకరించని నాయకులు పీఠాలెక్కడం ఇంకోవైపు ముప్పేట ముసురుకొస్తున్న కాలం మనది. ఇలా ప్రకృతి నియమాలూ పర్యావరణ రాజకీయాలూ శత్రు శిబిరాలుగా మారిన కాలం మనది. సమస్య మన అభివృద్ధి నమూనాలో, ఆర్థిక విధానాల్లో, మితవాద రాజకీయ పోకళ్ళలో వుందని చెప్పే వారే కరువైన కాలం కూడా మనది.

దీనికి సమాధానంగా ప్యారిస్ పరిసరాల్లో పదేళ్ళ క్రితం ఏడు రోజుల పాటు స్వేచ్ఛగా చర్చోప చర్చలు జరిపిన దేశ విదేశీ విద్యార్థులు "అందరూ అడిగే రోజు ఒకటి వస్తుంది. అప్పుడు సముద్రాలూ అమెరికాను నిలదీస్తాయి. వాతావరణమూ చైనాను నిగ్గదీస్తుంది" అంటారు. చూడ్డానికిది భావకవిత్వంగా కనిపించ వచ్చునేమో గాని ఇలాంటి భావితరం కన్నా పుడమి తల్లి రక్షణకు ప్రస్తుతానికి భరోసా ఎక్కడుంది?

## ఏజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ ముగ్గుల పోటీలు

తొలి అడుగు, యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ జనవరి : 10 యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పైల్వాన్ పురం గ్రామంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఏజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆడపడుచులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు ఏజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి మరియు సభ్యులు తెలిపారు. ఎజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామ ఆడపడుచులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తారు. ఈ ముగ్గుల పోటీలు ఆదివారం ఉదయం నుండి ప్రారంభించడం జరుగుతుందని ముగ్గులను పరిశీలించి అక్కడే విజేతలకు బహుమతి ఇవ్వడం జరుగుతుందని ఏజేఆర్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. మొదటి బహుమతిగా 2016/- రూపాయలు రెండో బహుమతిగా 1016/- మూడో బహుమతి నుండి ఆరవ బహుమతి వరకు చీరలు బహుమతులుగా ఇవ్వబడును. అదేవిధంగా ఈ ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతి ఉంటుందని ఎజేఆర్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ ముగ్గుల పోటీలు గ్రామ ఆడపడుచులు అందరూ పాల్గొని ఈ ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సభ్యులు కోరారు.



## కీర్తి వెంకన్నకు నివాళులర్పించిన మేరు సంఘం నాయకులు

**- అంతిమయాత్రలో పాల్గొన్న జిల్లా నాయకులు దోమకొండ సత్యనారాయణ**



తొలి అడుగు, యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ, జనవరి :10 యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రానికి చెందిన సోమేశ్ ట్రైలర్ కీర్తి సోమేశ్ తండ్రి కీర్తి వెంకన్న శుక్రవారం మరణించారు. వలిగొండ మండల మేరు సంఘం ఆధ్వర్యంలో వెంకన్న భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా నాయకులు దోమకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో తన సొంత ఖర్చులతో వచ్చిన బంధువులకు భోజన సౌకర్యాలు మరియు ఇతర కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అంతేకాకుండా గత పది సంవత్సరాలుగా మండలంలో మెరు సంఘం సభ్యులు ఎవరు మృతి చెందిన వారికి తన వంతు సహాయంగా ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నానని సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆదిమూలం సోమేశ్ కోశాధికారి వెంపటి మత్స్యగిరి, మాజీ అధ్యక్షులు ఆదిమూలం గోపి, గౌరవ అధ్యక్షులు కీర్తి రమేష్, రెగ్యులర్ ట్రైలర్ కీర్తి రమేష్, వెంపటి రాజు, ఆదిమూలం రమేష్, కీర్తి సత్యనారాయణ, కీర్తి శ్రీనివాస్, కీర్తి వెంకటేశం, రామగిరి వెంకటేశం, దోమకొండ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## నేటి యువత రేపటి భవిత

**- ఎస్ఐ కదిరే శ్రీకాంత్ గౌడ్.**



తొలి అడుగు, ఇల్లంతకుంట, జనవరి 10 : రాజన్న సిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వంతడుపుల గ్రామంలో ఎస్ పి సూచనల మేరకు మీ కోసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యంగా యువత చెడు వ్యాసనాలకు అలవాటు పడి తమ భవిష్యత్తును చెజేతులారా నాశనం చేసుకుంటున్నారని, గంజాయి లాంటి మత్తు పదార్థలకు అలవాటు పడకుండా,సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అంతేకాకుండా మైనార్లకు వాహనాలు ఇవ్వకూడదని అవగాహనరాహిత్యంగా వాహనాలు నడపడం వలన ప్రమదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయాని ట్రాఫిక్ నియమాలు పాటిస్తే మనతో పాటు ఎదుటివారికి హాని చేయకుండా అందరు సంతోషంగా ఉండవచ్చని, పిల్లలు ఏం చేస్తున్నారు అనే విషయములో ప్రతి తల్లి తండ్రులు ఆలోచించాలని 100 డయల్ మరియు మూఢనమ్మకాలు లాంటి పట్ల జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ మరియు వంతడుపుల వీపీవో అనిల్, సిబ్బంది గ్రామ ప్రజలు యువత పాల్గొనడం జరిగింది.

## విలువిద్య జట్టు ఎంపిక పూర్తి



తొలి అడుగు పరవాడ జనవరి 10 : జిల్లా అర్చరీ సంఘం ఆధ్వర్యంలో సంస్కృతి గ్లోబల్ స్కూల్ నందు జరిగిన జిల్లా స్థాయి విలువిద్య పోటీలు సంస్కృతి గ్లోబల్ స్కూల్ లో ఘనంగా ముగిసాయి.రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో మెరుగైన ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశామని విశాఖపట్నం జిల్లా ఆర్చరీ ప్రధాన కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు. రాష్ట్ర స్థాయి లో పాల్గొను ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు : దేశయ్,లలిత్ సాయి, యశ్వంత్ నాయుడు, తేజేశ్వర్,పూర్వ్ రాథోడ్ నాభ్య ప్రభాత్ గణేష్ మణి రత్నం హర్షవర్ధన్, సాయిమనస్వి, వైష్ణవి, ఆధ్య. వీరిని జిల్లా అర్చరీ సంఘ ఉప అధ్యక్షులు సత్యనారాయణ, కోశాధికారి పి. భాస్కర్ లు అభినందనలు తెలిపారు. ఈ పోటీలను చక్కగా నిర్వహింహించిన కోచ్ లు కె. గోవింద్, శివకుమార్ లను జిల్లా ఆర్చరి అధ్యక్షులు పి. సూర్య నారాయణ రెడ్డి అభినందనలు తెలిపారు.

# గొన్న కళాశాలలో అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు



తొలి అడుగు పరవాడ జనవరి 10: స్థానిక కొన్న కళాశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగోలి, బోగీ మంటలు, గాలిపటం పోటీ, పొంగలి తయారీ, తీన్మార్, డీజే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులందరూ అత్యంత ఆనంద ఉత్సహాలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గొన్న కళాశాల సెక్రెటరీ గొన్న హెమ్ చంద్ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఈ సంక్రాంతి సకల శుభాలను, ఆనందాన్ని అందించాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు.

# ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాలి

**-బండారు శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం.**



తొలి అడుగు దినపత్రిక : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా. పెదపళ్ళ విద్యార్థి దశలో వారు ఆశక్తి చూపిస్తున్న విధానాలకు ప్రోత్సహించి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయాలని కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ అన్నారు. ఆలమూరు మండలం నర్సిపూడి శ్రీవిద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో స్కూల్ డైరెక్టర్ కామిరెడ్డి గాంధీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రతిభగల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. శ్రీవిద్య పబ్లిక్ స్కూల్ కు చెందిన 9 మంది విద్యార్థులు ఇటీవల జాతీయ స్థాయిలో లీట్ గ్రూప్ నిర్వహించిన ప్రతిభ పోటీలలో అత్యుత్తమ ప్రతిభను చూపించారు. లీడ్ గ్రూప్ పోటీలలో ప్రతిభ చూపించిన విద్యార్థినులతోపాటు ఇటీవల మండల స్థాయిలో జరిగిన సైన్స్ ఫేర్ లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను అభినందించి వారికి ప్రోత్సాహక బహుమతులను బండారు శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఏఎంసి మాజీ చైర్మన్ దునే స్వామి నాయుడు, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సూరపు రెడ్డి సత్య, చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి, నాయకులు కొత్తపల్లి నగేష్, సలాది జయప్రకాష్ నారాయణ, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, తమ్మన భాస్కరరావు, పడాల అమ్మిరాజు, ఉండమట్ల బాలాజీ, ఉండమట్ల దుర్గ ప్రసాద్, చామకూరి శ్రీను, సయ్యపరాజు శ్రీనివాసరాజు, అడబాల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యను పట్టించుకోని పెదపళ్ళ బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకు మేనేజర్

**– ఫిర్యాదుదారుని సమస్య పరిష్కరించకుండా ఇష్టం వచ్చిన రీతిలో కస్టమర్లను ఇబ్బంది గురి చేస్తున్న మేనేజర్**








తొలి అడుగు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా. పెదపళ్ళ: బ్యాంకులో ప్రతి సమస్యను పరిష్కరించి బాధ్యత బ్యాంకు మేనేజర్ ఉంటుంది కానీ ఈ బ్యాంకు రూట్ సెపరేట్ సమస్యను పరిష్కరించే వలసిన మేనేజరె సమస్యను పరిష్కరించకుండా ఖాతాదారులను బంధువుల పై నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించారు. ఖాతాదారులు అంటే గౌరవం లేదు. సమస్య వస్తే పరిష్కారం మార్గం చూపించకుండా ఫిర్యాదుదారుల మీద ఇష్టం వచ్చిన రీతిలో ప్రవర్తించడం ఈయన నైజం వివరాల్లోకెళ్తే కొత్తపేట నియోజకవర్గ ఆలమూరు మండలంలోని కొత్తూరు సెంటర్లో గల బ్యాంక్ ఆఫ్ బరోడా పెదపళ్ల బ్యాంకులో ఒక ఖాతాదారు నుండి( గుత్తుల వీరలక్ష్మి) ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం వారి కుమారుడు ఎకౌంట్కి ట్రాన్స్ఫర్ చేయడానికి బ్యాంక్ ఆఫ్ బరోడా లో ఉన్న ఖాతాదారుడి నుండి ట్రాన్స్ఫర్ కాగితం తీసుకున్నారు. ఎమర్జెన్సీ మూలంగా ట్రాన్స్ఫర్ చేస్తున్నారు అని చెప్పిన నిర్లక్ష్య పూరిత ధోరణి లో బ్యాంకు మేనేజర్, సిబ్బంది ప్రవర్తించి ట్రాన్స్ఫర్ చేయలేదు. ఎందుకు ట్రాన్స్ఫర్ కాలేదు అని ఆసుపత్రిలో ఉన్న ఖాతాదారుని తరుపున టిఎన్టియుసి (కార్మిక సంఘం అధ్యక్షులు) అధ్యక్షులు స్వయన ఖాతాదారున్ని తమ్ముడు ఆసుపత్రి నిమిత్తం అమౌంట్ పడలేదు ట్రాన్స్ఫర్ అవ్వలేదు అని సమస్యను పరిష్కరించమని మేనేజర్ ని కోరగా నిర్లక్ష్య పూరిత ధోరణి లో ప్రవర్తించారు. బ్యాంకులో ఉంటే ఖాతాదారుడు సోదరునిపై అక్రమ కేసులు బనయిస్తాను అని అహంకారపూరిత వైఖరితో ప్రవర్తించారు. ఇంతకుముందు పనిచేసిన మేనేజర్ లు ఖాతాదారులకు ప్రజలకు అనుకూలంగా ఉండేవారు. ఇప్పుడు ఉన్నటువంటి ఈ బ్యాంకు మేనేజర్ దురుసుగా ప్రవర్తిస్తారని పలు ఖాతాదారు నుండి విమర్శలు వస్తున్నాయి. ఈ బ్యాంకు నుంచి మేనేజర్ పై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజల కోరారు. ప్రజలకు సహకరించి మేనేజర్ ను తొలగించి ఖాతాదారుల మనోభావాలను దెబ్బతీయకుండా బ్యాంక్ ఆఫ్ బరోడా హెడ్ ఆఫీస్ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు ఇతర ఖాతాల ప్రజలు కోరుకుంటున్నారు.

# పెదతాడి కళాకారులకు రామ్ కి ఫౌండేషన్ వితరణ.




తొలి అడుగు పరవాడ జనవరి 10: విశాఖ ఫార్మసిటీ హాబ్ లో శుక్రవారం జరిగిన సంక్రాంతి సంబరాల సందర్భంగా రామ్ కి ఫౌండేషన్ వారు పెదతాడి గ్రామంలోని కోలాటం కళాకారులకు చీరలు, కోలాటం కర్రలు మరియు భజన బృందానికి సౌండ్ బాక్స్, యమహా మ్యూజిక్ సిస్టం, డోలక్ మరియు భజన తాళాలను అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా సంక్రాంతి సంబరంలో పాల్గొన్న కళాకారులను ఉద్దేశించి విశాఖ ఫార్మసిటీ మెనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి లాల్ కృష్ణ గారు మాట్లాడుతూ భారతీయ కళలు మరుగుపడుతున్న ఈ రోజుల్లో తాడి గ్రామస్తులు ప్రాచీన కలలైన భజన మరియు కోలాటం నృత్యాలను సాధన చేసి ప్రదర్శించటం చాలా సంతోషంగా ఉంది అన్నారు. ఏ దేశమైతే భాషని సంస్కృతిని మరిచిపోతారు ఆ దేశం యొక్క ఉనికి ప్రశ్నార్ధకమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సి ఓ ఓ) శ్రీ మోదుగుల వాసుదేవ రెడ్డి గారు మాట్లాడుతూ తాడి కళాకారుల స్ఫూర్తితో మిగిలిన గ్రామాలకు కూడా ప్రాచీన కళలు సాధన చేసి ప్రాచీన కలలు మరుగున పడకుండా చూడాలని సూచించారు. చివరిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోలాటం కళాకారులకు చీరలు, సంక్రాంతి కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ డిప్యూటీ జనరల్ మేనేజర్ గిరిధర్ బక్షి , అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి. రాఘవరెడ్డి రామ్ కి ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ కే. శ్రీకాంత్ , విశాఖ ఫార్మాసిటీ అధికారులు, రామ్ కి ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# రావులపాలెం బస్ డిపో పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సత్యానందరావు,జనసేన ఇంచార్జ్ శ్రీనివాస్

తొలి అడుగు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం10: రావులపాలెం బస్ డిపోలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారికి సంక్రాంతి పండుగ వస్తున్న తరుణంలో మైగాపుల గురవయ్య నాయుడు సమకూర్చిన చీరలను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు,నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు, జక్కంపూడి వెంకటస్వామి,కె వి సత్యనారాయణ రెడ్డీ (చిన్న కె వి ),పెచ్చేటి చిన్నారావు,అంబటి కిషోర్ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సంస్కృతి గ్లోబల్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



తొలి అడుగు పరవాడ జనవరి 10: తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సంస్కృతి గ్లోబల్ స్కూల్ లో ముందస్తు సంక్రాంతి వేడుకలను సాంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు.చిన్నారులు హరిదాసు, గంగిరెద్దు వేషంలో ఆలరించగా మరికొంత మంది పశువులు, కోడి పుంజులు, పాలు పొంగే బొమ్మలతో ప్రాంగణంను అలంకరించారు. ఈ కార్యక్రమం ను ఉద్దేశించి ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను మరిచిపోకూడదని ఇలాంటి పండగలలో ఆధ్యాత్మికతతో పాటు కుటుంబ విలువలు కూడా నిండి ఉంటాయని తెలిపారు.ఈ వేడుకలలో తెలుగు సంప్రదాయంలో హాజరైన ఉపాధ్యాయులు పల్లె వాతావరణం ఉట్టిపడేలా విద్యార్థులతో కలిసి మెలిసి సాంస్కృతిక అంశాలలో పాల్గొన్నారు.కార్యక్రమం ను నిర్వహించిన ఉపాధ్యాయులు పూజిత,వినీలా,లీలా లను పాఠశాల డైరెక్టర్ పి. ఉదయా నాగశ్రీ అభినందనలు తెలిపారు.

# తిరుపతి సంఘటన చంద్రబాబు వైఫల్యమే...మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

**– జాతరలో మేకలనే బలిస్తారు సింహాలను కాదని మరోసారి నిరూపితమైంది... చిర్ల జగ్గిరెడ్డి**




తొలి అడుగు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా. రావులపాలెం 10: రావులపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద జరిగిన మీడియా సమావేశంలో మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి గారు మాట్లాడుతూ గతంలో తిరుపతి లడ్డును అపహాస్యం చేశారు దానిని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారిపై పై మోపే ప్రయత్నం చేశారని అన్నారు.కేవలం డిఎస్పి పై చర్యలు తీసుకుని పెద్దలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జరిగిన ఘటనను కప్పిపుచ్చేందుకు కూటమినేతలు సినిమా చూపించారు... చంద్రబాబు తిరుపతి పర్యటన ప్రజలను మభ్యపెట్టేందుకు చేసిన ప్రయత్నమే అని బాధితులకు 50 లక్షల రూపాయల పరిహారం కచ్చితంగా అందించాలి అని ఆయన కోరారు. చంద్రబాబు ఈ విషయంలో కొత్త చట్టం చెబుతున్నారు.. అక్కడున్న పరిస్థితిని మసిపూసి మారేడుకాయ చేస్తున్నారు...గతంలో విశాఖలో ప్రమాదం జరిగితే బాధితులకు కోటి రూపాయల పరిహారం చంద్రబాబు డిమాండ్ చేశారు మరి ఇప్పుడు ఎందుకు చంద్రబాబు ప్రకటించలేదు ... ప్రక్షాళన మొదలెడితే తిరుపతి తోనే ప్రారంభం కావాలి. పరిహారం ప్రభుత్వమే ఇవ్వాలి టిటిడి నిధుల నుంచి తీసుకోకూడదు..ఇదంతా దేవుడి తప్పేనని పురందేశ్వరి వ్యాఖ్యానించటం దారుణం..చివరకు జరిగిన తప్పును వెంకటేశ్వర స్వామి పై ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు .. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల కన్వీనర్లు, మండల బూత్ మేనేజర్లు, మరియు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీఎస్ఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన డాక్టర్ రాజమౌళి



తొలిఅడుగు, జనగామ, జనవరి10: జనగామ జిల్లా కేంద్రంలో గల ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో వందేమాతరం స్టూడెంట్ ఫెడరేషన్ (వియస్ఎఫ్.) నూతన సంవత్సరం క్యాలెండర్ ను విఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మంగళంపల్లి రాజు అధ్యక్షతన జనగామ ప్రముఖ వైద్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రాజమౌళి ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 12వ వార్డు అధ్యక్షులు వంగ యుగంధర్ పాల్గొని మాట్లాడారు. విఎస్ఎఫ్ విద్యార్థులలో పోటీతత్వం పెంపొందించి మంచి లక్ష్యాలను సాధించేందుకు తోడ్పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజమౌళి మాట్లాడుతూ విఎస్ఎఫ్ విద్యార్థుల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని, విద్యార్థులు వారి జ్ఞానాన్ని దేశాభివృద్ధికి కోసం ఉపయోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండ్ర ప్రవీణ్, విఎస్ఎఫ్ జనగామ జిల్లా అధ్యక్షులు నల్ల రాహుల్, పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్, జిల్లా నాయకులు బిట్ల నాగేందర్, కొండ కిరణ్, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

# 2024లో అత్యధికంగా అమ్ముడైన రెండో కారు..



తొలిఅడుగు, : మారుతి వ్యాగన్ఆర్ కారు ను 25 సంవత్సరాల క్రితం భారత మార్కెట్లోకి విడుదల చేసింది మారుతి కంపెనీ. అప్పటి నుండి ఇప్పటి వరకు ఈ వాహనానికి మార్కెట్లో డిమాండ్ మాత్రం తగ్గలేదు. మారుతి ఈ కారును 1999 సంవత్సరంలో భారత మార్కెట్లో విడుదల చేసింది. గత సంవత్సరం 2024లో ఈ కారు అత్యధికంగా అమ్ముడైన కార్ల జాబితాలో రెండవ స్థానంలో నిలిచింది. మొదటి స్థానం టైటిల్ టాటా మోటార్స్ కు దక్కింది. 40 ఏళ్లలో టాటా మోటార్స్ కారు ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవడం ఇదే తొలిసారి. 2024 సంవత్సరంలో టాటా పంచ్ బెస్ట్ సెల్లింగ్ కారుగా నిలిచింది. గత సంవత్సరం ఈ కారు 2.02 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. ఇక మారుతి వ్యాగన్ఆర్ కారు 1.90 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. మారుతి వ్యాగన్ఆర్ అంత ప్రజాదరణ పొందటానికి కారణం.. ఈ కారు సామాన్యుల బడ్జెట్లో దొరకటం. అదే సమయంలో ఈ మోడల్ను డబ్బుకు తగిన విలువ కలిగిన కారు అని కూడా పిలుస్తారు. ఎందుకంటే ఈ ధర వద్ద మారుతి ఈ కారులో మెరుగైన మైలేజీని ఇస్తుందని పేర్కొంది. మారుతి వ్యాగన్ఆర్ ధర, మైలేజ్, ఈ రెండు అంశాలు ప్రజలను ఆకర్షించడానికి సరిపోతాయి. ఢిల్లీలో మారుతి వ్యాగన్ఆర్ ఎక్స్-షోరూమ్ ధర రూ. 5,54,500 నుండి ప్రారంభమై దాని టాప్ వేరియంట్ ధర రూ. 7,20,500 వరకు ఉంటుంది. మారుతి వ్యాగన్ఆర్ మార్కెట్లో 9 రంగుల్లో లభిస్తుంది. ఈ వాహనం ఖ12చీ 4-సిలిండర్ ఇంజిన్తో పనిచేస్తుంది.

# మైక్రోసాఫ్ట్‌లో కోతలు..!

తొలిఅడుగు డెస్క్ : గ్లోబల్ దిగ్గజ టెక్నాలజీ కంపెనీ మైక్రోసాఫ్ట్ కొత్త ఏడాదిలో తమ ఉద్యోగులను తీవ్ర కలవరానికి గురి చేస్తోంది. ఆ సంస్థలో ఉద్యోగులను తొలగించనున్నట్లు వెల్లడించింది. కరోనా తర్వాత వేగంగా పుంజుకున్న ఐటి రంగంలో తమ ఉద్యోగాలకు డోకా లేదని భావించిన వారికి ఇది ఆందోళనకర అంశమే. ఈ కొత్త ఏడాది 2025లో ఉద్యోగాల కోతల కసరత్తును ప్రారంభించినట్లు రిపోర్టులు వస్తోన్నాయి. ఇటీవలి వరకు ఆర్థిక మాంద్యం, ఖర్చుల నియంత్రణ, ఎఐ సాకులతో సిబ్బందికి ఎసరు పెట్టిన టెక్నాలజీ కంపెనీలు.. తాజాగా ప్రతిభ లేని వారిని ఇంటికి పంపిస్తున్నామని కొత్త పాటను అందుకున్నాయి. మైక్రోసాఫ్ట్ కూడా ఇదే తరహా ప్రకటన చేసింది. తమ కంపెనీలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న వారిలో కొంత మందికి ఉద్వాసన పలుకుతున్నట్లు మైక్రోసాఫ్ట్ వర్గాలు వెల్లడించాయని అంతర్జాతీయ మీడియాల్లో వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో టెక్, ఐటి రంగంలోని ఉద్యోగుల్లో మళ్లీ ఆందోళన మొదలయ్యింది. మైక్రోసాఫ్ట్‌లో మెరుగైన పనితీరు కనబరిచిన ఉద్యోగులను ప్రోత్సహిస్తామని, కొత్త విషయాలు నేర్చుకునేందుకు, వృత్తి జీవితంలో ఎదిగేందుకు తోడుంటామని.. కానీ పని చేయని వారిపై తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. మెరుగైన పనితీరు చూపించే వారి సంఖ్యను పెంచుకునే ప్రయత్నంలో భాగంగా కొంత మందిపై వేటు వేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాయి. కంపెనీలోని మొత్తం ఉద్యోగుల్లో సుమారు 1 శాతం మందిని తొలగిస్తున్నట్లు సమాచారం. ఈ సంస్థ 2023లోనూ దాదాపు 10,000 మంది ఉద్యోగులను రోడ్డున పడేసింది. ఇది మొత్తం ఉద్యోగుల్లో 5 శాతంగా ఉంది. గత సంవత్సరం 2024లోనూ గేమింగ్ విభాగం నుంచి సుమారు 2000 మందికి ఉద్వాసన పలికింది. ఆర్థిక ఒత్తిళ్లు, మాంద్యం భయాలు, సరికొత్త టెక్నాలజీ అమలు వ్యూహాల నేపథ్యంలో ఈ 2025లోనూ గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థల్లో లేఆఫ్స్ ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తమ ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో తెలియని పరిస్థితుల్లో పని చేస్తున్నామని గతంలో పలువురు టెకీలు సోషల్ మీడియా వేదికగా తమ ఆవేదన తెలియజేశారు. మందగమనం, ఆర్థిక ఒత్తిళ్ల మధ్య ఇతర టెక్ కంపెనీల్లోనూ తొలుగింపులు ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# మరో విభాగంలో అడుగు పెట్టిన టాటా డిజిటల్..




తొలిఅడుగు డెస్క్ : టాటా న్యూ ఫిక్స్డ్ డిపాజిట్ల మార్కెట్‌ప్లేస్‌కు ప్రత్యేకత ఉంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా డిజిటల్ ప్రక్రియ. కస్టమర్‌లు తమ ఫిక్స్డ్ డిపాజిట్‌లను పూర్తిగా ఆన్‌లైన్‌లో కేవలం 10 నిమిషాల్లో తెరవవచ్చు. లిక్విడేట్ చేయవచ్చు. దేశంలోనే అత్యంత విశ్వసనీయ కంపెనీల్లో టాటా గ్రూప్ ఒకటి. ఇక మార్కెట్ విలువ పరంగా కూడా దేశంలోనే ఇదే అతిపెద్ద సంస్థ అనే చెప్పవచ్చు. తాజాగా టాటా ఓ కీలక ప్రకటన చేసింది. చిప్పుడు చిన్న మొత్తాల పెట్టుబడుల విభాగంలోకి అడుగుపెట్టినట్లు టాటా గ్రూప్ అనుబంధ సంస్థ అయిన టాటా డిజిటల్ తెలిపింది. ఫిక్స్డ్ డిపాజిట్ల కోసం టాటా న్యూ సూపర్ యాప్‌లో ఒక విభాగం ప్రారంభించినట్లు వెల్లడించింది. దీని ద్వారా ప్రముఖ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల వద్ద ఇన్వెస్టర్లకు గరిష్టంగా 9.10 శాతం వరకు వడ్డీ రేటు పొందేలా ఎఫ్‌డీ చేయవచ్చని సంస్థ తెలిపింది. ప్రముఖ ఆర్థిక సంస్థలతో పాటు రూ. 1,000 నుండి ఫిక్స్డ్ డిపాజిట్లలో పెట్టుబడి పెట్టడానికి అనుమతిస్తుంది. టాటా న్యూ ఫిక్స్డ్ డిపాజిట్ల మార్కెట్‌ప్లేస్‌కు ప్రత్యేకత ఉంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా డిజిటల్ ప్రక్రియ. కస్టమర్‌లు తమ ఫిక్స్డ్ డిపాజిట్‌లను పూర్తిగా ఆన్‌లైన్‌లో కేవలం 10 నిమిషాల్లో తెరవవచ్చు. లిక్విడేట్ చేయవచ్చు. ఇది ఎఫ్‌డీ వినియోగదారులకు ఉపయోగరంగా ఉంటుంది. ఇది ఎఫ్‌డీ పెట్టుబడులతో ముడిపడి ఉన్న సుదీర్ఘమైన రాత పని, బ్యాంకులను సందర్శించే ఇబ్బందులు తప్పుతాయి. కస్టమర్‌లు సేవింగ్స్ బ్యాంక్ ఖాతాను తెరవకుండానే ఎఫ్‌డిపై 9.1 శాతం వరకు వడ్డీ రేట్లను పొందవచ్చు. ×జ=ూ, జూ=జు, జ=×ూ×ూ వంటి అనేక రేటింగ్ ఏజెన్సీలు కంపెనీ ఫిక్స్డ్ డిపాజిట్ స్కీమ్‌ను మూల్యాంకనం చేసి, దాని ఆధారంగా రేటింగ్‌లు ఇస్తాయి. దీని ద్వారా అనుభవజ్ఞులైన ఇన్వెస్టర్లు, కొత్త వ్యక్తులు సులభంగా పెట్టుబడులు పెట్టవచ్చని టాటా డిజిటల్ చెబుతోంది. కస్టమర్లు కనీసం రూ.1,000 ఎఫ్‌డీ చేయగలరని కంపెనీ తెలిపింది. ఈ ఫిక్స్డ్ డిపాజిట్‌లో వారు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (డిఐసిజిసి) ద్వారా రూ. 5 లక్షల వరకు బ్యాంకు పెట్టుబడికి బీమా కూడా పొందుతారు. ఫిక్స్డ్ డిపాజిట్ మార్కెట్‌ప్లేస్‌తో విశ్వసనీయ ప్రొవైడర్ల నుండి అధిక వడ్డీ రేట్లను అందించడం ద్వారా సామాన్యులకు ఫిక్స్డ్-రిటర్న్‌ల వంటి ఆర్థిక ఉత్పత్తుల పరిధిని విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కంపెనీ తెలిపింది.

# ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే 'హత్య'



తొలిఅడుగు, సినిమా : 'మధ' వంటి సైకలాజికల్ థ్రిల్లర్‌తో అందరినీ మెప్పించిన దర్శకురాలు శ్రీ విద్య బసవ 'హత్య' అనే మరో థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకులను మెప్పించటానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం ఈనెల 24న రిలీజ్‌కి రెడీ అవుతోంది. ఈ సినిమాను మహాకాళ్ పిక్చర్స్ పతాకంపై ఎస్. ప్రశాంత్ రెడ్డి నిర్మిస్తున్నారు. ధన్య బాలకృష్ణ, పూజా రామచంద్రన్, రవి వర్మ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీ టీజర్ లాంచ్ వేడుక గురువారం జరిగింది. నటుడు రవివర్మ చేతుల మీదుగా టీజర్ విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకురాలు శ్రీవిద్య బసవ మాట్లాడుతూ, ''మధ' తరువాత థ్రిల్లర్ జోనర్‌లోనే రెండో సినిమా కూడా చేస్తున్నాను. ఇది అందరికీ తెలిసిన కథే అయినప్పటికీ గ్రిప్పింగ్‌గా, సీట్ ఎడ్జ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీగా అలరించేలా తెరకెక్కించాను. చాలా హార్డ్ వర్క్, ఎఫర్ట్స్ పెట్టి స్క్రీన్ ప్లే రాసుకుని చేసిన సినిమా ఇది. ఈ ప్రయాణంలో నాకెంతో సపోర్ట్ చేసిన నటీనటులు ధన్య బాలకృష్ణ, రవివర్మ, పూజా రామచంద్రన్ సహా అందరికీ థ్యాంక్స్. నరేష్ అద్భుత మైన బీజీఎంను అందించాడు. అభిరాజ్ విజువల్స్ చక్కగా కుదిరాయి. అనిల్ ఎడిటింగ్ సినిమాను మరింత క్యూరియస్‌గా మార్చింది. మా నిర్మాత ప్రశాంత్‌కి థ్యాంక్స్. ప్రేక్షకులు సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. ''మధ' సినిమా టీజర్ చూడగానే నేను శ్రీవిద్యకు కాల్ చేశాను. నేను కూడా సినిమాలో భాగం అవుతానని అన్నాను. చాలా చిన్న పాత్ర ఉందని చెప్పింది. నాకు నేనుగా వెళ్లి ఆ సినిమాలో యాక్ట్ చేశాను. అప్పుడు ఆమెతో ప్రారంభమైన ఆ జర్నీ ఇప్పుడు ఈ సినిమాలో ప్రధాన పాత్రలో నటించేలా చేసింది. రొటీన్‌కు భిన్నమైన రోల్‌ను శ్రీవిద్య నన్ను లుక్ టెస్ట్ చేసి ఎంపిక చేసింది. ఇది నాకొక ఛాలెంజింగ్ రోల్. శ్రీవిద్య కొత్త టైప్ ఆఫ్ మేకింగ్‌కి తెర తీసింది. సినిమా అందరినీ ఎంగేజ్ చేసే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. ఆడియెన్స్‌కు డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్‌నిస్తుంది' అని నటుడు రవివర్మ చెప్పారు.

# గేమ్ ఛేంజర్ పబ్లిక్ టాక్





తొలిఅడుగు, సినిమా : గేమ్ ఛేంజర్..గేమ్ ఛేంజర్..గేమ్ ఛేంజర్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు యావత్ వరల్డ్ వైడ్ గా మారుమోగుతున్న పేరు. గ్లోబల్ స్టార్ గా మారిన రామ్ చరణ్..గేమ్ చేంజర్ తో మరోసారి తన సత్తా చాటేందుకు ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. సంచలన దర్శకుడు శంకర్ డైరెక్షన్లో తెరకెక్కిన ఈ చిత్రం సంక్రాంతి రేసులో బరిలోకి దిగింది. దాదాపు మూడేళ్ళ పాటు చిత్రీకరణ జరుపుకున్న ఈ మూవీ ఎలా ఉంటుందో..? రామ్ చరణ్ యాక్టింగ్ ఎలా ఉందొ..? కథ ఏంటో..? శంకర్ ఏ రేంజ్ లో తెరకెక్కించాడో..? అంటూ అభిమానులు కొద్ది రోజులుగా ఎదురుచూస్తూ వచ్చారు. ఇక ఆ ఎదురుచూపులు తెరపడింది. వరల్డ్ వైడ్ గా పలు భాషల్లో ఈ మూవీ రిలీజ్ అయ్యింది. ఇక ఈ సినిమా చూసిన అభిమానులు , సినీ ప్రేక్షకులు సినిమా ఎలా ఉందొ..సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. హీరో ఎంట్రీ అదిరిపోయిందని, ఇంటర్వెల్ సినిమాకే హైలెట్ అవుతుందని , ప్రథమార్ధంలో వచ్చే డోప్ సాంగ్ పిక్చరైజేషన్, అసలు ఆ పాటను అలా ఆలోచించడం గ్రేట్ అని అంటున్నారు. ఫస్ట్ హాఫ్‌లో ఐఏఎస్‌గా రామ్ నందన్ యాక్టింగ్, కియారాతో జోడి, ఇంటర్వెల్ బ్లాక్ ఇవన్నీ సినిమాకు హైలెట్ అవుతాయని కొంతమంది అంటున్నారు. ఇక రామ్ చరణ్ యాక్టింగ్‌కు వంక పెట్టలేమని చెబుతున్నారు. అయితే కొంత మంది మాత్రం ఎమోషనల్‌గా కనెక్ట్ కాలేకపోతోంది అని చెబుతున్నారు. ఇంటర్వెల్‌కు వచ్చే ట్విస్ట్‌తో అందరికీ మైండ్ బ్లాక్ అవుతుంది. అదే ఈ ఫస్ట్ హాఫ్ మొత్తానికి హైలెట్ అవుతుందని అంతా అంటున్నారు.

# 'గాంధీ తాత చెట్టు' ట్రైలర్ విడుదల

తొలిఅడుగు, సినిమా : స్టార్ డైరెక్టర్ సుకుమార్ కుమార్తె సుకృతివేణి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీతాత చెట్టు'. ఈ మూవీ ట్రైలర్‌ను కథానాయకుడు మహేష్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి మనస్సులను హత్తుకునేలా సినిమా ఉండేలా ఉందన్నారు. సుకృతి, చిత్ర యూనిట్ అందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ట్విట్టర్‌లో పోస్టుచేశారు. తాజాగా విడుదలైన గాంధీతాత చెట్టు ట్రైలర్ చూస్తే ఓ బాలిక ఇచ్చిన మాట కోసం గాంధీ మార్గాన్ని ఎంచుకున్న కథగా తెరకెక్కించినట్లు అర్థమవుతోంది. గాంధీ పేరు పెట్టుకున్న ఓ అమ్మాయి.. ఆయన బాటను, సిద్ధాంతాలను అనుసరిస్తూ, తన తాతకు ఇష్టమైన చెట్టును, తన ఊరును ఎలా రక్షించుకుంది అనే కథాంశంతో సినిమా తెరకెక్కినట్లుగా తెలుస్తోంది. ఈనెల 24న సినిమాను విడుదల చేస్తున్నామని దర్శకురాలు పద్మావతి తెలిపారు. ఈ చిత్రంలో ఆనంద్ చక్రపాణి, రఘురామ్, భానుప్రకాష్, నేహాల్ ఆనంద్ కుంకుమ, రాగ్ మయూర్ ముఖ్యపాత్రలు పోషించారు. సుకుమార్ రైటింగ్స్, గోపీటాకీస్ సంస్థలతో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధురావు నిర్మించారు.




# ఆడపిల్లను కాపాడుకుందాం



తొలిఅడుగు, సినిమా : మంచి సందేశంతో రూపొందించిన 'నిన్ను నన్ను కన్న ఆడది.. రా' పాటను రాష్ట్ర మంత్రి సీతక్క విడుదల చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ "ఒక అద్భుతమైన ఆలోచనతో సమాజంలో మార్పు తీసుకురావడానికి ఈ పాట చేసిన రమణా రెడ్డి, ఆలీకి కృతజ్ఞతలు. కామంతో కళ్ళు మూసుకునిపోయి మృగంలా ప్రవర్తించే వారిలో మార్పు రావాలి. కులం, మతం, వృత్తితో సంబంధం లేకుండా అత్యాచారాలు జరుగుతున్నాయి. ఇప్పటికే వీటిని అరికట్టడానికి ప్రభుత్వం తరుపున ప్రయత్నం చేస్తున్న సమయంలో ఈ పాట ఒక మంచి తొలి అడుగులా కనిపిస్తుంది. ఈ పాట అందరిలో మార్పును తీసుకొస్తుందని కోరుకుంటున్నాను. మనం అందరం ఆడపిల్లను కాపాడుకుందాం–"అని అన్నారు. ఆలీ మాట్లాడుతూ "ఈ పాట చేయడానికి ముఖ్య కారణం మనం ప్రస్తుతం బయట చూస్తున్న పరిస్థితులు. క్యాన్సర్ కంటే దారుణంగా వ్యాపిస్తుంది ఈ రేప్ అనే వ్యాధి. నాకు ఈ పాట వినగానే యమలీల సినిమాలోని పాట గుర్తొచ్చింది. దర్శకుడు రమణా రెడ్డి ఇక్కడ నుండి అమెరికా వెళ్లి మన దేశానికి ఏమైనా చేయాలని అనుకుని తిరిగి వచ్చి ముందుగా ఈ పాటతో మొదలు పెట్టాడు. పాట విన్న వెంటనే నేను ఈ పాటని మన రాష్ట్రానికి, ఆడవారికి అంకితం చేయాలని అనుకున్నాము. ఈ పాట పూర్తిగా అన్ని చానల్స్, ఆడియో కంపెనీలకు ఉచితం. కేవలం మంచి అనేది అందరికీ వెళ్ళాలి అనే ఉద్దేశంతో చేశాం"అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు రమణారెడ్డి, బీఆర్కే న్యూస్ అధినేత బొల్లా రామ కృష్ణ, నటుడు శ్రీనివాస్, నటి మంజుల, జుబేదా ఆలీ